క్లుప్తంగా

నేడు పురపాలిక బడ్జెట్ సమావేశం

మాచర్ల: మాచర్ల పురపాలక సంఘం 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశం పురపాలక సమవేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో బడ్జెట్‌కు సంబంధించి పలు అంశాలు చర్చించి, ఆమోదించడం జరుగుతుందని పేర్కొన్నారు. చైర్మన్ నరసింహారావు అధ్యక్షత వహిస్తారని, కౌన్సిర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పీఆర్కే నివాళి



మాచర్ల: కంభంపాడు సర్పంచ్ దేవరాయ సుబ్బారావు కుమారుడు అనిల్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీలో ఉన్న అనిల్ కుమార్ మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పీఆర్కే వెంట మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, కంభంపాడు మాజీ సొసైటీ అధ్యక్షుడు గాదె శ్రీనివాసరెడ్డి, జి.బ్రహ్మారెడ్డితోపాటు, పలువురు ఉన్నారు.

25న రుణ అర్హత మేళా

రెంటచింతల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న క్రెడిట్ క్యాంప్(రుణ అర్హత మేళ)ను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.సరోజినిదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25కు ఎంఎస్ఎంఈ కింద స్వయం ఉపాధిలో భాగంగా బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ లబ్ధిదారులకు ఈ క్రెడిట్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమాచారాన్ని గ్రామాల్లో పంచాతీ కార్యదర్శులు దండోర వేయించి తెలియజేయాలని తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్న ఈ రుణ అర్హత మేళలో మండల పరిధిలోని వివిధ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు(సెలక్షన్ కమిటీ సభ్యులు) తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మాచర్ల రూరల్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నాయని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు చలివేంద్రం దాహార్తిని తీరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్లు బత్తుల వాణి, రమణ, ఆర్ఐ ఇక్కుర్తి అనిల్‌కుమార్, టైపిస్టు నాగవల్లి, వీఆర్వోలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యడ్లపాడు జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక రైతు చెన్నుపాటి శ్రీనివాసరావుకు చెందిన జామాయిల్ తోటలో మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి, దీంతో ఒక ఎకరం విస్తీర్ణంలో చెట్లు కాలిబూడిదయ్యాయి. ఘటన తెలుసుకున్న చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. లీడింగ్ ఫైర్‌మెన్ ఆర్. మాణిక్యరావు, ఫైర్‌మెన్ పవన్ కుమార్, డ్రైవర్ ఆపరేటర్ కేపీఎల్ఎన్. రాజు, హోంగార్డ్ వై. మల్లికార్జునరావు సమయస్ఫూర్తితో చర్యలు తీసుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో సుమారు రూ. 60,000 విలువైన జామాయిల్ చెట్లు దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాదానికి నిర్లక్ష్యంగా పడేసిన సిగరెట్ మాత్రమే కారణమై ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

కాల్వల్లో పూడికతీత పనులు ప్రారంభం

శావల్యాపురం: మండల కేంద్రంలో రూ. 2 లక్షల పంచాయతీ నిధులతో మురుగుకాల్వల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు కార్యదర్శి బోడ్డు యాకోబు శుక్రవారం తెలిపారు. గ్రామంలో అన్నీ వీధుల్లో ఉన్న మురుగు కాల్వలన్నీ పూర్తిస్థాయిలో పూడికతీత పనులు చేపట్టి అనంతరం కాల్వలో పూడిక వచ్చిన మట్టిని ట్రాక్టరు ద్వారా తొలిగిస్తామన్నారు. అలాగే స్వచ్ఛ సంపద కేంద్రంలో వర్మీకంపోస్టు ఎరువు తయారు అవుతుందన్నారు. పరిశుభ్రత బాధ్యత వహించాలన్నారు. తడి, పొడి చెత్తాను వేరుచేసి పంచాయతీకు అదనపు ఆదాయం వచ్చే లా చర్యలు చేపట్టామన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఏసురాజు, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

వివాహ బంధం..
అయ్యిందా చట్టబద్ధం!



- మందకొడిగా వివాహ రిజిస్ట్రేషన్లు
- ధృవీకరణ పత్రాలు పొందడంలో నిర్లక్ష్యం
- అధికారుల అవగాహన కార్యక్రమాలు శూన్యం
- నమోదు చేసుకోవడంలో జంటల వెనుకడుగు
- బాల్య వివాహాలూ ఇందుకు ఓ కారణం
- సందర్భం వస్తే కానీ అటు వైపు చూడని వైనం



గురజాల: అధికారుల నిర్లక్ష్యమో.. ప్రజల్లో చైతన్యం లేకపోవడమో.. వివాహ రిజిస్ట్రేషన్లు మందకొడిగా జరుగుతున్నాయి. వివాహ నమోదుకు వధూవరులు ముందుకు రాకపోవడానికి గ్రామాల్లో బాల్య వివాహాలు కూడా ఒక కారణమని తెలుస్తోంది. గ్రామ పంచాయతీల్లో వివాహ నమోదు తప్పనిసరి అని ప్రభుత్వాలు చెబుతున్నా.. ఎక్కడా కూడా అది అమలు కావడం లేదనే చెప్పాలి. ప్రస్తుతం గ్రామ సచివాలయాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వివాహాన్ని నమోదు చేసి, ధృవీకరణ పత్రాలు ఇస్తున్నారు. వివాహ నమోదు తప్పనిసరి చేయాలని 2002లో చట్టం చేశారు. జీఓ–193 ప్రకారం ప్రతీ గ్రామంలో కార్యదర్శులు వివాహాలను నమోదు చేయాలని అందులో ఉంది. వివాహ రిజిస్ట్రేషన్ చట్టంలో కుల, మతాల ప్రాతిపదికన కొన్ని మినహాయింపులు ఉండగా 2012లో క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంతో అన్ని మతాల వారికి ఈ చట్టాన్ని వర్తింపజేశారు.

అవగాహన లోపం

వివాహ బంధాన్ని చట్టబద్ధం చేసుకోవడంలో ప్రజల్లో అవగాహన పూర్తిగా కొరవడింది. ఏదన్న సందర్భంగా వస్తే మినహా అందుకు భార్యాభర్తలు ముందుకు రావడం లేదు. అధికారులు కూడా వివాహ రిజిస్ట్రేషన్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలి. కానీ, ఆ పరిస్థితి మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. సచివాలయాల్లో కేవలం జనన, మరణ ధ్రువీకరణ పత్రాలపై ఉన్న శ్రద్ధ దేని మీద లేదనే చెప్పవచ్చు. వివాహ వయస్సు ఆడ పిల్లలకు 18, మగ పిల్లలకు 21 ఏళ్లు తప్పనిసరి అని గ్రామాల్లో అవగాహన కల్పించాలి. వివాహ రిజిస్ట్రేషన్ ద్వారా కలిగే ప్రయోజనాలు, చేసుకోకపోతే కోల్పోయే సౌకర్యాలు, పథకాలను వివరించాలి. అప్పుడే బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే సమస్యలను ప్రజలు అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గ్రామాల్లో వీటిపై పంచాయతీ, ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా అవగాహన కల్పించి బాల్య వివాహాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

మందకొడిగా రిజిస్ట్రేషన్లు

గురజాల నియోజకవర్గంలోని గురజాల మండలంలోని సచివాలయాల్లో 18, దాచేపల్లిలో 15, మాచవరంలో 15, పిడుగురాళ్ల 32 మొత్తం సుమారుగా 60 నుంచి 80 వివాహ రిజిస్ట్రేషన్‌లు గతేడాది జరిగాయి. గురజాల, పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏడాదిలో 400 నుంచి 500 వరకు పెళ్లిళ్లు నమోదయ్యాయి.

ధృవీకరణ పత్రం ఉపయోగాలు

వివాహ ధృవీకరణ పత్రం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. కొత్తగా వివాహం చేసుకున్న వారు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎవరైనా ఉన్నత చదువులు, ఉద్యోగాలకు విదేశాలకు వెళ్లాలంటే భార్యభర్తలనే ధ్రువీకరణ పత్రం తప్పనిసరి.

తుది ఓటర్ల జాబితాకు సూచనలివ్వాలి



తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న స్పెషల్ కలెక్టర్ గాయత్రీదేవి

మాచర్ల రూరల్: నియోజక వర్గంలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా ఫైనల్ పబ్లికేషన్‌లో రాజకీయ పార్టీలు, ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి గాయత్రీ దేవి కోరారు. శుక్రవారం తహసీల్దార్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఓటర్ కార్డుల్లో పేరు ఉండి ఫొటో లేని వ్యక్తులను గుర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, ఫైనల్ ఓటర్ల జాబితా తయారు చేయడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తగు సలహాలు, సూచనలందించాలని ఆమె కోరారు. ఓటర్ జాబితా పోలింగ్ కేంద్రాల ఎంపిక, అభ్యంతరాలుంటే తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు కిరణ్ కుమార్, షేక్ బాషా, ఫణీంద్ర, డిప్యూటీ తహసీల్దార్ బత్తుల వాణి, రమణ, ఆర్ఐ ఇంటూరి అనిల్ కుమార్, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ బూత్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు శివ, బీజేపీ, బీఎస్పీ ప్రతినిధులు గుమ్మడి నాసరయ్య, కాశీపతి, గుండాల సైదులు, యేచూరి సురేష్ తదితరులున్నారు.

అగ్నిమాపక శాఖాధికారికి ఉగాది పురస్కారం



కుమారు శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని అగ్ని మాపక కేంద్రంలో అగ్నిమాపక శాఖ అధికారిగా పని చేస్తున్న కుమారు శ్రీనివాసరావుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాల్లో ఉత్తమ సేవా పతకం అవార్డును ప్రకటించిందని కుమారు శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2018లో రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకం అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ల ద్వారా మూడు సార్లు, 2024లో పల్నాడు జిల్లా కలెక్టర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు ఆయన తెలిపారు. వివిధ రకాల భారీ అగ్ని ప్రమాదాలలో పాల్గొనటం, ఎంతో మంది ప్రజల ప్రాణాలను రక్షించినందుకు 8 సార్లు క్యాష్ అవార్డులు అందుకున్నానని చెప్పారు. కోటప్పకొండ దగ్గర కెనాల్‌లో కొట్టుకుపోతున్న వారిని కాపాడటం జరిగిందని, అలాగే గతంలో ముప్పాళ్ల కాలువలో పడిపోయిన వ్యక్తిని రక్షించినట్లు చెప్పుకొచ్చారు.

పేరంటాలమ్మ తిరునాళ్లకు 200 ఏళ్ల చరిత్ర

- 30న బొందిలిపాలెంలో అమ్మవారి తిరునాళ్ల
- వారం రోజులు ముందుగా సందడి



మూలవిరాట్

శావల్యాపురం: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతూ అందరి చేత పూజలందుకుంటోంది మండలంలోని శానంపూడి బొందిలిపాలెంలోని శ్రీఅడవి పేరంటాలమ్మ అమ్మవారు. అమ్మను కొలిచినంతనే తమ కోర్కెలు ఇట్టే తీరుతాయని అందరి విశ్వాసం. ఆ జగన్మాతకు ప్రతిఏడాది తిరునాళ్లు నిర్వహిస్తారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఈనెల 30న ఈ తిరునాళ్ల వేడుక జరుగనుంది.

విశిష్టతను పరిశీలిస్తే..

200 సంవత్సరాల క్రితం పేరయ్య, పేరమ్మ దంపతులు ఆవులను తీసుకుని మేత కోసం అడవికి వెళ్లగా హఠాత్తుగా పులి పేరయ్యపై దాడి చేసి చంపేసింది. భర్త మరణాన్ని తట్టుకోలేని భార్య చితి మంటల్లో దూకి సతీసహగమనం చేసింది. తదుపరి ఇరువురు దంపతులు అడవిలో శిలరూపాల్లో వెలిశారు. శిలల రూపాల్లో వెలిసిన పేరయ్య, పేరమ్మలను పరిసర గ్రామాల ప్రజలు శ్రీ అడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారిగా నామకరణం చేసి నాపరాళ్ళతో దేవాలయంగా ఏర్పాటు చేసి అప్పటి నుంచి పూజలు చేయటం ఆనవాయితీగా వస్తుంది. కొన్ని సంవత్సరాలు అనంతరం బొందిలిపాలెం గ్రామానికి చెందిన పాపసాని పేంటయ్య మరొకరు అమ్మవారి దేవాలయం అభివృద్ధికి 5 ఎకరాలు పొలాన్ని విరాళంగా ఇచ్చారు. అప్పటి నుంచి ఉగాది పర్వదినం ప్రతి ఏటా తిరునాళ్ల వేడుకలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రానురాను అమ్మవారి విశిష్టత నలుమూలలకు వ్యాపించటతో దేవాలయం అభివృద్ధికి గ్రామస్తులు సౌజన్యంతో దేవాలయం దేవదాయ శాఖ పరిధిలో చేరటంతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో ప్రతిఏటా తిరునాళ్ల వేడుకలు ఘనంగా జరుపుతున్నారు. ఇరు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు.

వారం ముందుగా సందడి

తిరునాళ్లకు వారం రోజుల నుంచి భక్తులతో అమ్మవారి దేవాలయం సందడి నెలకొంటుంది. పశువులు, జీవాలు దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేయటంతో పాటు మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి ప్రసాదం రూపంలో తమ మొక్కులు తీర్చుకుంటారు. నియోజకవర్గ స్థాయిలో ప్రసిద్ధిగాంచిన ఈ అమ్మవారి తిరునాళ్ల వేడుకలకు రంగం సిద్ధం చేస్తున్నారు. తిరునాళ్ల వేడుకలకు వివిధ గ్రామాల నుంచి తడిక ప్రభలు, బోర్ల్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నారు.

బస్టాండ్‌లో ఎమ్మార్పీ విక్రయాలపై తనిఖీలు



బస్టాండ్‌లోని ఓ షాపును తనిఖీ చేస్తున్న జిల్లా విజిలెన్స్ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు

నరసరావుపేట: జిల్లా లీగల్ మెట్రాలజీ ఇనస్పెక్టర్ ఎస్.శివశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞ నారాయణ ఆర్టీసీ బస్టాండులోని కూల్ డ్రింక్ షాపులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో కొందరు వ్యాపా రస్తులు కూల్ డ్రింక్ బాటిల్‌పై ఉన్న ధర కన్నా ఎక్కువ ధర వసూలు చేస్తున్నందున కేసులు రాశారు.

ఈ సందర్భంగా పిల్లి యజ్ఞనారాయణ మాట్లాడుతూ దయచేసి జిల్లా వ్యాప్తంగా వున్న వ్యాపారస్తులు ఏ వస్తువునూ ఎమ్మార్పీ కన్నా ఎక్కువ అమ్మవద్దని, ఆవిధంగా విక్రయించటం నేరమని, అటు వంటి షాపులపై ఆకస్మిక తనిఖీలు చేసి కేసులు రాయడం జరుగుతుందని హెచ్చరించారు. మళ్లీ బస్టాండ్‌లోని వ్యాపారులు ఇదేపని చేసినట్లు ఫిర్యాదులు వస్తే జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వారిషాపు సీజ్ చేయించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ దాడులలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, ఉప కార్యదర్శి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బోధి పాఠశాలలో యూకేజీ కాన్వొకేషన్



పిడుగురాళ్ల: మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలోని బోధి పాఠశాలలో శుక్రవారం యూకేజీ కాన్వొకేషన్ వేడుకలు నిర్వహించారు. ప్రాథమిక విద్యలోకి అడుగుపెడుతున్న యూకేజీ విద్యార్థులు తమ సర్టిఫికెట్లను పాఠశాల చైర్మన్ సునితా రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. చైర్మన్ సునితా రెడ్డి మాట్లాడుతూ.. యూకేజీ కాన్వొకేషన్ చిన్నారుల విద్యా ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గేట్ ఫలితాల్లో సత్తా చాటిన శ్వేతశ్రీ



దుర్గి: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్ – 2025) ప్రకటించిన ఫలితాలలో దుర్గి గ్రామానికి చెందిన కొమరాల శ్వేత శ్రీ ఆల్ ఇండియా స్థాయిలో 241 ర్యాంకు సాధించింది. విద్యార్థి శ్రీకాకుళంలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిబుల్ ఐటీ) లో చదువుతోంది. బాలిక తల్లిదండ్రులు ఆదినారాయణ, అరుణ ఆటోమొబైల్ షాపు నిర్వహిస్తారు.

ఆగి ఉన్న లారీకి నిప్పు

గురజాల: మరమ్మతుల కారణంగా నిలిపి ఉన్న లారీకి గుర్తుతెలియని దుండుగులు నిప్పంటించిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండలంలోని సమాధానం పేట గ్రామానికి చెందిన బాణావత్ నరసింహా నాయక్‌కు చెందిన లారీ మరమ్మతులకు గురై సమాదానం పేట, మిట్ట గుడిపాడు మార్గం మధ్యలో నిలిపాడు. లారీకి మరమ్మతులు చేయిస్తున్న తరుణంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. లారీ పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న నరసింహానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పవిత్ర మాసం రంజాన్

పిడుగురాళ్ల: రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదని వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో షేక్ సుభాని బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. విస్తార్ విందుకు హాజరైన వారికి బిర్యానీ పంపిణీ చేశారు. వారితో కలిసి భోజనం చేశారు. వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: పట్టణంలో మంచినీటి సరఫ రాలో ఇబ్బందులు లేకుండా ప్రతిరోజూ సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ పథకానికి సంబంధించి ఇంటర్ కనెక్షన్ పనులు, పైపులైన్ల లీకేజీ మరమ్మతులు జరుగుతున్న దృష్ట్యా వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుకున్న సమయానికి సక్రమంగా పనులు పూర్తి అయితేనే ఈ వేసవి నుంచి పట్టణ ప్రజలకు రోజు వారి మంచినీటి సరఫరా చేయడం సాధ్య మౌతుందన్నారు. ఏఏ వార్డుల్లో నీటి ఎద్దడి ఉందో గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, ఏఈఈ చల్లా శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వానర సైన్యం..స్వైరవిహారం



రెంటచింతలలో ఇంటి ముందు గోడపై కోతులు

రెంటచింతల: మండల కేంద్రంలో పలు కాలనీల్లో కోతులు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. స్థానికుల మీదకు ఎగబడి గాయపరుస్తున్నాయి. ఇటీవల కొందరు ఓ వ్యాన్ ద్వారా అధిక సంఖ్యలో వానరాలను కంభంపాడు పెద్ద కాలువ వద్ద విడిచిపోయారు. సుమారు 20 నుంచి 25 కోతులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఫాతిమానగర్, నాయుడుపేట ఎస్సీ కాలనీ, ఆరోగ్యపురం, రేగులమాన్యం, పిచుకలగడ్డ తదితర కాలనీల్లో ఈ సమస్య అధికంగా ఉంది. గ్రామ పంచాయతీ దృష్టికి ఎన్నోసార్లు సమస్యను తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోతులు నివాసాలపై ఉన్న వస్తువులను ఎత్తుకుపోతున్నాయని, పెద్దలతో సహా పిల్లలపై దాడులు చేస్తూ.. భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులను కోతులను పట్టించి, సమస్య నుంచి తమను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్గీకరణ బిల్లు ఆమోదంపై ఎమ్మార్పీఎస్ సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్, కూటమి నేతలు

విజయపురిసౌత్: ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏపీ అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం చెందడంతో స్థానిక ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఊరే మార్క్ ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్, కూటమి నేతలు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ మాదిగల కోసం సుదీర్ఘ పోరాటం చేసిన మందకృష్ణ మాదిగకు, అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం చెందడానికి కృషి చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు, ఆడెపు కోటయ్య, డాక్టర్‌బసివిరెడ్డి, మీసాల దానియేలు, సత్తిబాబు, సిద్దల దానియేలు, ఊరే మధు, అరుణ్, కిరణ్, డైబా, గోపీ, కటికల నాని, యలమంద బాలస్వామి, రామాంజనేయులు, మస్తాన్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఆరుగురు గైర్హాజరు

రెంటచింతల: మండల కేంద్రంలోని నాలుగు కేంద్రాల్లో నడుస్తున్న పదో తరగతి పరీక్షలకు శుక్రవారం 800 విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ–2 వై.శివనాగేశ్వరరావు వెల్లడించారు. ఆరుగురు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, ఎండల కారణంగా ఆరోగ్య కార్యకర్తలను మందులతో విద్యార్థులకు అందుబాటులో ఉంచామని చెప్పారు. సెయింట్ జోసఫ్స్, సెయింట్ ఆన్స్ కేంద్రాలను జిల్లా విద్యాశాధికారి చంద్రకళ, వైఆర్ఎస్ పాఠశాల, ఫాతిమా విద్యాని కేతన్ కేంద్రాలను భాస్కర్‌రావు నేతృత్వంలోని ప్లైయింగ్‌స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది.

పరీక్ష కేంద్రాల తనిఖీ

మాచర్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో 1,100 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కేంద్రాలను తహసీల్దారు కిరణ్‌కుమార్, ఎంఈఓ అల్లి సురేష్, విద్యా శాఖ అధికారులు తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణను అడిగి తెలుసుకున్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి



మాట్లాడుతున్న మురళి, అమలకుమారి

నరసరావుపేట రూరల్: జిల్లాలోని రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా మార్చేందుకు కృషిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తెలిపారు. రావిపాడురోడ్డులోని బృందావనంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సిబ్బంది సమీక్ష సమవేశానికి మురళీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 28 మండలాల్లో పనిచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రతి రైతు పీఎండీఎస్ విధానాన్ని పాటించే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఖరీఫ్ ముందు గ్రామాల్లో రైతులకు కావలసిన ఇన్‌పుట్స్ ఘన, ద్రవ, కషాయాలను ముందుగానే ఎన్‌పీఎం షాపులో అందుబాటులో ఉంచాలని సూచించారు.

జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కే.అమలకుమారి మాట్లాడుతూ జిల్లాలోని 28 మండలాల్లో 132 గ్రామ పంచాయతీల్లో 2002 గ్రామ సమైఖ్య సంఘాలు, 113 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 35,540 మంది రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తున్నారని తెలిపారు. 2025–26 సంవత్సరంలో 82వేల ఎకరాల భూమిని ప్రకృతి వ్యవసాయంలో సాగుచేయాలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వివరించారు. నేషనల్ మిషన్ న్యాచురల్ ఫార్మింగ్ పథకంలో మొదటి విడతలో 56 గ్రామాలు, రెండవ విడతలో 64గ్రామాలను మొత్తం 120 గ్రామాలను తీసుకున్నట్టు తెలిపారు. గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించి రైతులకు సంబంధించిన భూమి విస్తీర్ణం, పంట, పశువుల వివరాలు సేకరించి ఉరివి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో కూడా భూమిని కప్పి ఉంచే విత్తన గుళికల విధానం గురించి రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాల్లోని మహిళలు ఇంటి పరిసరాల్లో ఖాళీగా ఉన్న ప్రాంతంలో 365 రోజులు తోటల పెంపకం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏలు లక్ష్మీ, మాన్విష, ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్య ధోరణితో కార్మికుల శ్రమదోపిడీ

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆంజనేయనాయక్

నరసరావుపేట: ప్రభుత్వ విధానాలు, అధికారుల నిర్లక్ష్య వైఖరితో కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని, పరిసరాల శుభ్రతకు పాటుపడుతున్న కార్మికులపట్ల నిర్లక్ష్యవైఖరి తగదని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయ నాయక్ అన్నారు. జీతాలు చెల్లించాలని అడిగినందుకు మీకు వచ్చేది ఇచ్చేది అంతే.. ఇష్టమైతే రండి కష్టమైతే మానుకోండని మున్సిపల్ కమిషనర్ చెప్పడాన్ని కార్మికులు నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఆందోళన శిబిరాన్ని సందర్శించిన సందర్భంగా ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ ఆప్కాస్ ఉన్నప్పటికీ నెల రోజులు పనిచేస్తే 15 రోజులకు వేతనాలు అందులో కూడా కోతలు ఎందుకు విధిస్తున్నారని మండిపడ్డారు. ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి పోతున్నాయో తేల్చాలని దీనిపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, నాయకులు జీవరత్నం, వీరకుమార్, నరసింహరావు, నవీన్, కార్మికులు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ లేకుంటే రేషన్ సరుకులు బంద్!

యడ్లపాడు: మండలంలోని కారుచోల గ్రామ ప్రజలు నిత్యావసర సరుకుల పంపిణీ వ్యవస్థను ఆటంకం లేకుండా కొనసాగించేందుకు ఈ–కేవైసీని ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి వీఆర్వోఓ కేపీ చారి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికీ ఈ–కేవైసీ పూర్తి కాని రేషన్ కార్డు లబ్ధిదారులు తమ సమీప రేషన్‌షాప్ డీలర్ వద్దకు వారి ఆధార్ కార్డుతో వెళ్లి ఈ–కేవైసీని పూర్తి చేసుకోవాలని సూచించారు. ఒకవేళ వేలిముద్రలు పడకపోతే తక్షణమే మీకు సమీపంలోని ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ అప్డేట్ చేయించుకోవాలి. ఆ తరువాత, మీ రేషన్ డీలర్ వద్ద ఈ–కేవైసీని పూర్తి చేయించుకోవాలని తెలిపారు.